# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో **(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
**& చైతన్య గళం** ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 310 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 22 -12 -2024 | వెల : .రూ. 5.00




## అందరికీ రైతు భరోసా ఇవ్వాల్సిందే..


- కోతలు పెట్టి భూమితో ఉన్న అనుబంధాన్ని తుంచేస్తారా?

హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ విధానం చూస్తుంటే రైతు భరోసాకు కోతలు పెట్టే సూచనలు కనిపిస్తున్నాయని మాజీ మంత్రి కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. సాగు విస్తీర్ణం, పంటల ఉత్పత్తిని పెంచేందుకు అందరికీ రైతు భరోసా

-మిగతా 2 లో

# రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు





రాళ్ల, గుట్టలకూ రైతుభరోసా ఇద్దామా?

- రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు
- ప్రతిపక్షనేత అసెంబ్లీకి వస్తే కడిగేద్దామనే ఉన్నాం
- 80వేల పుస్తకాలు చదివిన మేధస్సుతో 'కూలేశ్వరం' కట్టారు
- రూ.22వేల కోట్లను ఇలాగే అనర్హులకు కట్టబెట్టారు
- చట్టం ముందు నిలబెడతాం
- అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్

డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) -హైదరాబాద్

పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై ఆపార్టీ నేతలు సిగ్గుపడాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఫైర్ అయ్యారు. తొమ్మిదిన్నరేండ్ల ఆపార్టీ

-మిగతా 2 లో




## సంబంధాల బలోపేతమే లక్ష్యం

- కువైట్ పర్యటనలో ప్రధాని మోడీ

డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) కువైట్

భారత ప్రధాని నరేంద్రమోడీ రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం కువైట్ చేరుకున్నారు. 1981లో ప్రధానిగా ఉన్న సమయంలో ఇందిరాగాంధీ కువైట్‌ని సందర్శించారు. 2009లో భారత ఉప రాష్ట్రపతి

-మిగతా 2 లో



## బీమాపై జిఎస్‌టి తగ్గింపు వాయిదా

- సెకండ్‌హ్యాండ్ కార్లపై 18 శాతం పన్ను
- జిఎస్‌టి కౌన్సిల్‌లో నిర్ణయం
- పాప్‌కార్న్‌పై మూడు రకాల పన్నులు

న్యూఢిల్లీ

జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీ ప్రీమియంలపై వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) తగ్గింపు అంశాన్ని జిఎస్‌టి కౌన్సిల్ వాయిదా వేసింది. శనివారం జైసల్మేర్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన

-మిగతా 2 లో

## అభిమానుల కోసం ఎంత దూరమైనా వెళ్తా



- నాకు మానవత్వం లేదనడం సరికాదు
- రోడ్ షో చేయలేదు..
- ఏ పోలీస్ అధికారీ నాకు చెప్పలేదు..
- థియేటర్ నాకు దేవాలయంలాంటిది
- అభిమానుల కోసం ఎంత దూరమైనా వెళ్తా
- నాకూ ఆ వయస్సున్న కొడుకు ఉన్నాడు.. నేనూ బాధపడుతున్నా
- నా వ్యక్తిత్వాన్ని కించపరచడం బాధగా ఉంది.
- నూటికి నూరు శాతం అన్నీ తప్పుడు ఆరోపణలే.. సినీ నటుడు అల్లు అర్జున్

డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)-హైదరాబాద్

నాపై చేసినవన్నీ తప్పుడు ఆరోపణలే. నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నా వ్యక్తిత్వాన్ని దిగజార్చేలా చేస్తున్న ఆరోపణలను మనసుకి తీసుకోలేకపోతున్నాను'

-మిగతా 2 లో



## భూభారతి కాదు భూహారతి

తెలంగాణ రైతుకు రక్షణ కవచం ధరణి : మండలిలో కవిత

హైదరాబాద్

భూభారతి బిల్లుతో కాంగ్రెస్ ప్రభుత్వం భూములకు భూహారతి పాడుతుందని బీఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ రైతులకు రక్షణ కవచంగా ధరణి ఉందనీ, దాన్ని రద్దు చేయడం వల్ల రైతులు

-మిగతా 2 లో



## శాసనసభ నిర్ణయం మేరకే 'రైతు భరోసా'

పంట సాయంపై సలహాలు, సూచనలు ఇవ్వండి

కోతలు విధిస్తామని తాము చెప్పలేదు

'రైతు భరోసా' పై స్వల్పకాలిక చర్చలో మంత్రి తుమ్మల

-హైదరాబాద్

పంట పెట్టుబడి సాయం అందించే విషయంలో సలహాలు, సూచనలు ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శాసనసభ్యులను కోరారు. 'రైతు భరోసా'లో కాంగ్రెస్ ప్రభుత్వం కోతలు విధిస్తున్నట్టు

-మిగతా 2 లో



## 25, 26 తేదీల్లో రాష్ట్రంలో ఉపరాష్ట్రపతి పర్యటన

- పోలీసు శాఖ పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్, బందోబస్త్ చేయాలి
- ఉన్నత స్థాయి అధికారులతో సీఎస్ సమీక్ష

డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)-హైదరాబాద్

భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఈ నెల 25,26న రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్ల పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపరాష్ట్రపతి తన పర్యటనలో భాగంగా 25న మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి ఐసీఏఆర్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శిస్తారనీ, అక్కడే సేంద్రీయ విధానంలో సాగు చేస్తున్న

-మిగతా 2 లో

# రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు

(మొదటి తరువాయి)

పాలన దోపిడీలు, దౌర్జన్యాలు, నిర్బంధాలతోనే సాగిందని విమర్శించారు. 80వేల పుస్తకాలు చదివిన అపర మేథావి, ప్రతిపక్షనేత అసెంబ్లీకి వచ్చి, తన జ్ఞానాన్ని ఎందుకు తెలంగాణ ప్రజలకు పంచట్లేదని ప్రశ్నించారు. ఆ పుస్తకాలు చదివి, లక్షల కోట్లు ఖర్చు చేసి 'కూలేశ్వరం' కట్టారని ఎద్దేవా చేశారు. పదేండ్లలో రాష్ట్రంలోని అన్ని వనరుల్ని దోపిడీ చేశారనీ, మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని ఇష్టం వచ్చినట్టు నిర్ణయాలు తీసుకొని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. ఇలాంటి ఆర్థిక నేరగాళ్లను ఉరి తీసినా తప్పులేదనీ, దుబారు వంటి దేశాల్లో వాళ్లను బహిరంగంగానే ఉరి తీస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అసెంబ్లీలో రైతు భరోసాపై స్వల్ప వ్యవధి చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఏకబిగిన దాదాపు గంటన్నరపాటు ప్రసంగించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై నిప్పులు చెరిగారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సహా ఎవర్నీ వదల్లేదు. అధికారంలో ఉన్నప్పుడు వారు తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారనీ, రిజర్వ్‌బ్యాంకు సహా ఆర్థిక సంస్థలన్నింటినీ మోసం చేసి, వేలకోట్లు దోచుకున్నారంటూ ఆయా గణాంకాలతో సహా వివరించారు. ఆ సమయంలో సభలోనే ఉన్న కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ ఎదురుదాడి చేసేందుకు ప్రయత్నించగా, స్పీకర్ అనుమతించలేదు. ఓ దశలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కే తారకరామారావు 'ఈ కామెడీ షో ఏంటి అధ్యక్షా' అనడం వినిపించింది. ప్రతిపక్షనేత కేసీఆర్ అసెంబ్లీకి వస్తే, ఆయన చేసిన అరాచకాలన్నింటినీ చెప్పి, కడిగి పారేయాలని ఏడాదిగా ఎదురు చూస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సభకు వస్తే, చేసిన తప్పులకు సమాధానాలు ఎక్కడ చెప్పాల్సి వస్తుందో అని ఆయన ముఖం చాటేస్తున్నారని విమర్శించారు.

### రైతు భరోసాపై అనుమానాలొద్దు

రైతు భరోసాపై రాష్ట్ర రైతాంగం ఎలాంటి అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అయితే గత పాలకులు ఇచ్చినట్టు రాళ్లు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతు భరోసా ఇవ్వాలో వద్దో సూచించాలని ప్రతిపక్ష పార్టీలను కోరారు. దీనిపై ప్రధాన ప్రతిపక్షం సలహాలు తీసుకుని విధివిధానాలు రూపొందించి, ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నామనీ, రాజకీయాల కోసం వారు సభలో నానా అల్లరి చేసినా, కనీసం స్పీకర్‌కు రాతపూర్వకంగా సలహాలు, సూచనలు ఇస్తే, వాటిని పరిశీలించి, నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

### రాళ్లు, గుట్టలకూ ఇద్దామా?

బీఆర్ఎస్ హయాంలో రైతు బంధు ఉద్దేశం పెట్టుబడి సాయం పథకమనీ, గడచిన పదేండ్లలో రూ.72,817 కోట్లు దీనికోసం ఖర్చు చేశారని సీఎం వివరించారు. వీటిలో రూ.22 వేల కోట్ల ప్రభుత్వ సంపదను సాగులో లేని భూములు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం కోసం సేకరించిన భూములు, దొంగ పాస్‌బుక్కులు సృష్టించిన వారికి, క్రషర్ యూనిట్లకు, మైనింగ్ భూములకు, అనర్హులకు ఆయాచిత లబ్ది చేకూర్చారని ఆక్షేపించారు. ఇప్పుడు కూడా రైతు భరోసాను అలాగే ఇద్దామా%ొ% అని ప్రతిపక్షాలను ఉద్దేశించి అడిగారు. గతంలో గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని రాజీవ్ రహదారికి, ఆమన్‌గల్ ప్రాంతంలో శ్రీశైలం రోడ్లకు కూడా రైతు బంధు ఇచ్చారని గుర్తుచేశారు. హైదరాబాద్ చుట్టుపక్కల 50కి.మీ పరిధిలో 70 నుంచి 80శాతం వ్యవసాయం చేయడం లేదనీ, కానీ మూడు కోట్ల ఎకరాలకు రైతుబంధు డబ్బులు చెల్లించారని విమర్శించారు. రైతుబంధు రూపంలో వేలాది కోట్లు కొల్లగొట్టారని చెప్పారు. తమ ప్రభుత్వ లక్ష్యం చివరి పేదవాడికి కూడా ప్రభుత్వ పథకాల ఫలాలు అందజేయడమేననీ, వాళ్లు ఇచ్చారు కాబట్టి మమ్మల్నీ అందరికీ ఇవ్వాలంటూ, వాళ్లనే ఆదర్శంగా తీసుకోమంటున్నారని ఎద్దేవా చేశారు

# అందరికీ రైతు భరోసా ఇవ్వాల్సిందే..

(మొదటి తరువాయి)

ఇవ్వాలని డిమాండ్ సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని శాసనసభలో రైతు భరోసా స్వల్పకాలిక చర్చపై ఆయన మాట్లాడారు. పాన్‌కార్డు, ఐటీ చెల్లిస్తున్న వారికి, పోడు రైతులకు, పత్తి, కంది పంటల కాల పరిమితి ఎనిమిది నెలలు కాబట్టి వారికి రైతు భరోసా ఇస్తారా? కోత పెడతారా? చెప్పాలని డిమాండ్ చేశారు. వారికి భూమితో ఉన్న అనుబంధాన్ని తుంచేస్తారా? అని ప్రశ్నించారు. రైతు భరోసా స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందుకు రైతుబంధుపై కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు ప్రచారం చేసిందని విమర్శించారు. రైతు పచ్చబడితే కొందరికి కండ్లు ఎర్రబడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాత బాగుపడితే కొందరు ఓర్వలేకపోయారని చెప్పారు. వందల ఎకరాలున్న రైతులకు, పెద్ద రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చామని తమపై దుష్ప్రచారం చేశార న్నారు. 'నూటికి 95శాతం మంది చిన్న సన్నకారు రైతులే ఉన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం తెలంగాణలో 91.33 శాతం మంది లబ్దిదారులు ఐదెకరాలు అంతకంటే తక్కువ ఉన్నవారే. 7.28 శాతం మంది ఐదు నుంచి 10 ఎకరాల మధ్య ఉన్నారు. పదెకరాలపై ఉన్నవారు కేవలం 1.39 శాతమే. 25 ఎకరాలున్నవారు 0.9 శాతం' అని అన్నారు. రూ.72 వేల కోట్ల రైతుబంధులో పెద్ద రైతులకు ఇచ్చింది 1.39 శాతం మాత్రమేనని వెల్లడించారు. అందులో 80శాతం మంది లబ్దిదారులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన వారే ఉన్నారని తెలిపారు. అందులో బీసీలు 54 శాతం, ఎస్సీలు 13శాతం, ఎస్టీలు 13 శాతం ఉన్నారనీ, 70 శాతం రైతుబంధు పైసలు వారి ఖాతాల్లో పడ్డాయన్నారు. 4.5 లక్షల ఎకరాల ఆర్వోఎఫ్ఆర్ భూములను గిరిజనులకు ఇచ్చామన్నారు. ఆ భూముల్లో ఒక్క పంట మాత్రమే పండుతుందనీ, వారికిచ్చే పంటసాయంలో కోత పెట్టొద్దని ఆయన సూచించారు.

### రాజీనామాకు సిద్ధం

వంద శాతం రుణమాఫీ జరిగినట్టు నిరూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేసి వెంటనే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ ప్రభుత్వానికి కేటీఆర్ సవాల్ విసిరారు. రుణమాఫీ కోసం రూ. 49,500 కోట్లు చెప్పి చివరకు రూ. 26వేల కోట్లకు పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. రుణమాఫీ చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌలు రైతుకు, భూయజమానికి రైతుబంధు ఇస్తామన్నారు. తప్పకుండా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతుభరోసాకు బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు కేటాయించారనీ, 70 లక్షల మంది రైతన్నలకు రూ. 23 వేల కోట్లు కావాలని గుర్తు చేశారు. రైతుబంధు కోతలకు సిద్ధపడ్డ తర్వాతనే కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారని ఆరోపించారు. మంత్రివర్గ ఉపసంఘం వేసి టైంపాస్ చేస్తున్నారని విమర్శించారు. వానకాలం రైతుబంధు ఎగ్గొట్టినట్టే%ొ%యాసంగికి కూడా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండారెడ్డిపల్లి, కొడంగల్, సిరిసిల్ల పోదామా? ఏ ఒక్క ఊర్లో అయినా 100 శాతం రుణమాఫీ జరిగినట్టు నిరూపించాలని సవాల్ విసిరారు.

# బీమాపై జిఎస్‌టి తగ్గింపు వాయిదా

(మొదటి తరువాయి)

55వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రస్తుతం బీమా ఉత్పత్తులపై 18 శాతం పన్ను రేటు అమల్లో ఉంది. ఇది చాలా ఎక్కువని.. ముఖ్యంగా ప్రజలను బీమాకు దూరం చేసేలా పన్ను విధానం ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. తాజా కౌన్సిల్‌లో దీనిపై ఆరంభంలోనే చర్చించారు. మరింత లోతైన చర్చ అవసరమని పలువురు సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు మంత్రుల బృందానికి నేతృత్వం వహించిన బీహార్ డిప్యూటీ సిఎం సామ్రాట్ చౌదరి తెలిపారు. రూ.5 లక్షల వరకూ సీనియర్ సిటిజన్ల ఆరోగ్య బీమా, టర్మ్ జీవిత బీమా పాలసీపై జిఎస్‌టిని ఐదు శాతానికి తగ్గించాలని సామ్రాట్ చౌదరి బృందం ప్రతిపాదించింది. జనవరిలో మరోమారు మంత్రుల బృందం సమావేశం అవుతుందన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్, వ్యక్తిగత బీమా పాలసీ లేదా సీనియర్ సిటిజన్ల బీమా పాలసీ తదితర అంశాలపై మరోసారి చర్చిస్తామన్నారు. బీమా పాలసీల ప్రీమియంలపై జిఎస్‌టి తగ్గించడం వల్ల తమ ఆదాయం పడిపోతుందని పలు రాష్ట్రాల ఆర్థిక మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారని చౌదరి తెలిపారు. రూ.5 లక్షలు దాటిన ఆరోగ్య బీమాపై 18 శాతం జిఎస్‌టి రేటు యధాతథంగా కొనసాగుతుంది. దీంతో సామాన్యులకు మరోసారి నిరాశే ఎదురైంది. పాప్‌కార్న్‌పై మూడు రకాల పన్ను రేట్లను అమలు చేయాలని జిఎస్‌టి కౌన్సిల్ నిర్ణయించడం విశేషం. రుచిని బట్టి రేటు ఉంటుందని తెలిపింది. సాల్ట్ లేదా మసాలా పాప్ కార్న్ ప్యాక్ చేయకుండా అమ్మితే దానిపై 5 శాతం జిఎస్‌టి పడనుంది. ఇక ప్యాక్ చేసి అమ్మితే 12 శాతం, షుగర్ కలిపిన పాప్ కార్న్ అయితే 18 శాతం జిఎస్‌టి వసూలు చేయాలని నిర్ణయించారు. జిఎస్‌టి రేట్ల హేతుబద్ధీకరణకు సంబంధించి ఏర్పాటైన మంత్రుల బృందం 148 వస్తువుల రేట్లను హేతుబద్ధీకరించాలని ప్రతిపాదించింది. అందులో సిగరెట్లు, శీతల పానీయాలు, పొగాకు ఉత్పత్తులు ఉన్నాయి. ప్రస్తుతం వీటిపై ఉన్న 28 శాతం జిఎస్‌టిని 35 శాతానికి చేర్చాలన్న కీలక ప్రతిపాదనపై కౌన్సిల్‌లో చర్చించినట్లు సమాచారం. స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లపై విధిస్తున్న 18 శాతం జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించేందుకు ఫిట్‌మెంట్ కమిటీ ప్రతిపాదించింది. దీనిపై నిర్ణయం వాయిదా వేయాలని కౌన్సిల్ భావించింది. పెట్రోల్, డీజిల్ చిన్న కార్లపై ప్రస్తుతం ఉన్న 12 శాతం జిఎస్‌టిని 18 శాతానికి పెంచాలని నిర్ణయం తీసుకుంది. పాత ఎలక్ట్రిక్ వాహనాలకు కూడా ఇది వర్తిస్తుంది. ప్రస్తుతం పెద్ద కార్లకు 18 శాతం జిఎస్‌టి వర్తిస్తోంది. ప్రస్తుతం జిఎస్‌టితో 5, 12, 18, 28 పన్ను శ్లాబులు ఉన్నాయి. కొత్తగా 35 శాతం శ్లాబ్‌ను తీసుకురావాలని మంత్రుల బృందం ప్రతిపాదించింది. హానికర ఉత్పత్తులకు ఈ శ్లాబు రేటును వర్తింపజేయాలని పేర్కొంది. ఫోర్టిఫైడ్ బియ్యంపై జిఎస్‌టి 5 శాతానికి తగ్గించాలని కౌన్సిల్ నిర్ణయించింది. జన్యు చికిత్సలకు పన్ను మినహాయింపునిచ్చింది. రుణ గ్రహీతలపై బ్యాంకులు, బ్యాంకింగేతర విత్త సంస్థలు (ఎన్‌బిఎఫ్‌సిలు) వేసే జరిమానాలపై జిఎస్‌టిని ఎత్తివేశారు.

# శాసనసభ నిర్ణయం మేరకే 'రైతు భరోసా'

(మొదటి తరువాయి)

పతిపక్ష సభ్యులు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అందులో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. శనివారం హైదరాబాద్ లోని శాసనసభలో రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చను ఆయన ప్రారంభించారు. 'మేం ఇచ్చిన నోట్‌లో రైతు భరోసాపై ఏమీ చెప్పలేదు. గత ప్రభుత్వంలో జరిగిన విధి, విధానాలే సభ ముందు ఉంచాం. బీఆర్ఎస్ చెప్పిందే అమలు చేయాలనే ఆలోచన వారికి ఉంది. ఏ పంటకు ఎంత ఇస్తామనేది ఇంకా నిర్ణయించలేదు. అది తప్పుడు ప్రచారమే. సభలో సభ్యుల సూచనల తర్వాతే నిర్ణయిస్తాం. పత్తి, చెరుకుకు ఏం చేయాలనేది సభ్యులు చెబితే దానిపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ప్రజలు, సభ్యుల అభిప్రాయం ప్రకారం విధి,విధానాలను నిర్ణయిస్తాం' అని చెప్పారు. కాంగ్రెస్ సభ్యులు విజయరమాణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో క్వింటాల్‌కు 15 కేజీల తరుగు తీసి రైతులను దోపిడీ చేశారని విమర్శించారు. సన్న ధాన్యానికి బోనస్ ఇచ్చిన రైతులను ఆదుకుంటున్నదని చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇస్తున్నామని తెలిపారు. రైతు రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 72శాతం మందికి రుణమాఫీ పూర్తి అయిందన్నారు.

# సంబంధాల బలోపేతమే లక్ష్యం

(మొదటి తరువాయి)

హమీద్ అన్సారీ ఈ పశ్చిమాసియా దేశాన్ని సందర్శించారు. దాదాపు 43 ఏళ్ల తర్వాత కువైట్‌లో పర్యటించిన రెండవ ప్రధానిగా మోడీ నిలిచారు. కువైట్ అమీర్ షేక్ మెషల్ అల్ అహ్మద్ అల్ జాబర్ అల్ –సబా ఆహ్వానం మేరకు ప్రధాని మోడీ పర్యటించనున్నారు. మోడీ రెండు రోజుల పర్యటనలో కువైట్ ప్రధాని, ఆ దేశ యువరాజు సబా అల్ – ఖలిద్ అల్ సబాతో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, విద్యుత్, సంస్కృతులపై, ప్రజల మధ్య సంబంధాలపై ఇరువురు ప్రధానులు చర్చించుకోనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మోడీ భారతీయ బ్లూ కాలర్ కార్మికులు ఉన్న లేబర్ క్యాంప్‌ను కూడా సందర్శించనున్నారు. మోడీ పర్యటన ఇరు దేశాల మధ్య కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని భారత విదేశాంగ మంత్రిత్వశాఖ తెలిపింది. రామాయణ, మహాభారతాలను అరబిక్‌లోకి అనువదించిన అబ్దుల్లా అల్ బరౌన్, వాటిని ప్రచురించిన అబ్దుల్ లతీఫ్ అల్ నసీఫ్‌లను మోడీ శనివారం కలుసుకున్నారు. ఇరు దేశాల మధ్య భవిష్యత్తుల్లో భాగస్వామ్యానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించు కోవడానికి ఈ పర్యటన ఒక అవకాశం కల్పించిందని మోడీ ఢిల్లీ నుండి బయలుదేరడానికి ముందుగా వ్యాఖ్యానించారు. కువైట్‌లో భారతీయులు 21శాతంగా వున్నారు. అక్కడి కార్మిక శక్తిలో 30శాతం మంది భారతీయులే.

## అభిమానుల కోసం ఎంత దూరమైనా వెళ్తా

(మొదటి తరువాయి)

అని హీరో అల్లుఅర్జున్ ఆవేదన వ్యక్తం చేశారు.సంధ్య థియేటర్ ఘటనపై అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. తన వ్యవహారశైలిపై వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. తన క్యారెక్టర్‌ను తక్కువ చేసే ప్రయత్నం జరుగుతోందంటూ భావోద్వేగానికి గురయ్యారు. అల్లుఅర్జున్ మాట్లాడుతూ, 'సినిమా రిలీజ్ టైమ్‌లో థియేటర్ యాజమాన్యం, పోలీసులు, మా వాళ్ళు.. ఇలా అందరూ ఓ మంచి ఇంటెన్షన్‌తోనే ఉన్నప్పటికీ అనుకోకుండా ఈ ఘటన జరిగింది. ఇది కావాలని ఎవ్వరూ చేసింది కాదు. ఓ యాక్సిడెంట్ మాత్రమే. అయితే ఈ విషయంలో నాపై చేసినవ్నీ తప్పుడు ఆరోపణలే. నేను థియేటర్ దగ్గర ఎలాంటి రోడ్ షో చేయలేదు. విపరీతమైన జనం కారణంగా థియేటర్‌కి కొంచెం దూరంలో నా కారు ఆగిపోయింది. చేయి చూపిస్తూ ముందుకు కదలండని పోలీసులు చెబితేనే, నేను బయటకు వచ్చి చేతులు ఊపాను. రేవతి చనిపోయినట్టుగాని, ఆమె కొడుకు చావు బతుకుల్లో ఉన్నట్టుగానీ ఏ పోలీస్ అధికారి నాకు చెప్పలేదు. థియేటర్ బయట చాలా పెద్ద క్రౌడ్ ఉందని, మీరు ఇక్కడ్నుంచి వెళ్తే బాగుంటుందని మా వాళ్ళు చెబితే, వెంటనే అక్కడ్నుంచి వెళ్ళిపోయాను. జరిగిన ఘటన గురించి నాకు తరువాత రోజు తెలిసి, చాలా బాధపడ్డాను. బాధితులను కలవమని మా బన్నీవాసుకి చెప్పాను. నేనూ వెళ్ళాలని సిద్ధమయ్యాను. హాస్పిటల్‌కి వెళ్ళిన బన్నీవాసు అక్కడి పరిస్థితి చెప్పి, నాపై కేసు నమోదు చేశారని చెప్పాడు. దీంతో లీగల్‌గా అక్కడికి వెళ్ళడానికి సాధ్యపడలేదు. అందుకే వెంటనే బాధిత కుటుంబానికి అండగా ఉంటానని చెబుతూ వీడియోని రిలీజ్ చేశా. హాస్పిటల్‌లో ఉన్న బాబు శ్రీతేజ్ పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు మా వాళ్ళతో కనుక్కుంటున్నా. మా నాన్నని, దర్శకుడు సుకుమార్‌ని.. ఇలా మావాళ్ళని పంపాలని ప్రయత్నించా. కానీ కేసు వలన వాళ్ళు హాస్పిటల్‌కి వెళ్ళలేకపోయారు. హాస్పిటల్‌కి మేం వెళ్ళలేనంత మాత్రానా మేం అస్సలు బాధపడటం లేదంటే ఎలా?, నా అభిమానులే కాదు.. ఏ హీరో అభిమానులకూ ఏమైనా జరిగితే వెంటనే ఆదుకుంటా.. ఎంత దూరమైన సరే వెళ్ళి పరామర్శిస్తా.. అలాంటిది నా అభిమాని కుటుంబానికి ఇలా జరిగిందంటే నేనెలా సంతోషంగా ఉంటాను?, అసలు నేను సినిమాలు చేసేదే వాళ్ళ కోసం. థియేటర్లను నేను దేవాలయంగా భావిస్తా. థియేటర్లకి వచ్చే నా అభిమానులకు, ప్రేక్షకులకు వినోదాన్ని అందించాలనేదే నా తపన. థియేటర్ దగ్గర ఘటన జరిగినప్పుడు నా వెంట నా బాబు, పాప ఉన్నారు. 'పుష్ప2ః సినిమా ప్రపంచవ్యాప్తంగా ఎంతో గొప్పగా ఆడుతుంది. ఎన్నో చోట్ల సక్సెస్‌మీట్ ఫంక్షన్లు చేయాలనుకున్నాం. జరిగిన ఘటన దృష్ట్యా వీటిని వద్దనుకున్నాం. తెలుగువాళ్ళ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని నేను ప్రయత్నం చేస్తుంటే, తప్పుడు ఆరోపణలతో నా వ్యక్తిత్వాన్ని దిగజార్చుతూ మనల్ని మనమే కిందకు లాక్కోవడం బాధగా ఉంది. నాపై చేస్తున్న ఆరోపణలన్ని నూటికి నూరు శాతం అవాస్తవం' అని చెప్పారు.

## భూభారతి కాదు భూహారతి

(మొదటి తరువాయి)

తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. శాసనమండలిలో శనివారం భూభారతి బిల్లుపై చర్చ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమాత పోర్టల్ భూమేతకు దారి తీస్తుందని ఆరోపించారు. భూభారతి తిరోగమన చర్య అని విమర్శించారు. ధరణి వచ్చిన తర్వాత భూమోసాలు పోయాయని అన్నారు. ధరణితో ఆటలాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చరిత్ర క్షమించదని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అంటే భూ రక్షణ సమితి అని వివరించారు. రైతులకు భూభద్రతను కల్పించిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. రాష్ట్రంలో 2.8 కోట్ల ఎకరాల భూమి ఉందనీ, అందులో 1.5 కోట్ల ఎకరాలు సాగు భూమి ఉందని వివరించారు. 17.8 లక్షల ఎకరాల భూమి మాత్రమే వివాదాల్లో ఉందన్నారు. గతంలో కౌలుదారులు కేసులు వేస్తే 20–25 ఏండ్ల పాటు రైతులు కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని అన్నారు. కేసీఆర్ రైతుకు మాత్రమే భూమికి యాజమన్య హక్కు ఉండే విధంగా ధరణి పోర్టల్‌ను తెచ్చారని వివరించారు.

## 25, 26 తేదీల్లో రాష్ట్రంలో ఉపరాష్ట్రపతి పర్యటన

(మొదటి తరువాయి)

500 మంది రైతులతో ముఖాముఖిలో పాల్గొంటారని సీఎస్ తెలిపారు. అదే రోజు రాత్రి కన్హా శాంతివనంలో బస చేస్తారని పేర్కొన్నారు. ఉప రాష్ట్రపతి పర్యటన జరిగే రెండు రోజుల పాటు బ్లూ బుక్ ప్రకారం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రంగా రెడ్డి, మెదక్ జిల్లా కలెక్టర్‌లు, ఉప రాష్ట్రపతి కార్యాలయంతో, రాష్ట్రంలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలీసు శాఖ పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్, బందోబస్త్ చేయాలని డీజీపీకి సూచించారు. ఈ పర్యటనలో సరిపడా వైద్య సిబ్బందితో వైద్య సౌకర్యాలు కల్పించాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. భారత ఉపరాష్ట్రపతి ప్రయాణించే దారిలో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ శాఖకు సూచించారు.

**తెలుగు పంచాంగం 22/12/2024, శనివారం**

- సూర్యోదయం: ఉదయం 6:45
- సూర్యాస్తమయం: సాయంత్రం 5:43
- తిథి: షష్ఠి (మధ్యాహ్నం 1:32 వరకు)
- నక్షత్రం: ఉత్తర (రాత్రి 7:57 వరకు)
- రాహుకాలం: సాయంత్రం 4:12 నుండి 5:43 వరకు
- యమగండం: మధ్యాహ్నం 12:00 నుండి 1:31 వరకు
- అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:52 నుండి 12:36 వరకు

# సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక దీక్ష

## 15వ రోజు కూడా నిరసనలు

హైదరాబాద్, డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ ఉద్యోగాలను రెగ్యులర్ చెయ్యాలని ఏకైక లక్ష్యంతో చేపడుతున్న నిరవధిక దీక్షలో భాగంగా రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట 15వ రోజు నల్లని దుస్తులు ధరించి నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు గత రెండు దశాబ్దాలుగా అభద్రత భావంతో చాలీచాలని వేతనాలతో తమ విధులు నిర్వహిస్తున్నారని, ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా తమకు ఎప్పుడూ అన్యాయమే ఎదురవుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. నేడు రంగారెడ్డి జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం చేపడుతున్న ధర్నా శిబిరానికి రాష్ట్ర సమగ్ర ఉద్యోగుల సంఘం కోశాధికారి, రాష్ట్ర సమన్వయకర్తల సంఘం కార్యదర్శి దుర్గం శ్రీను హాజరై, ఉద్యోగుల దీక్షకు మద్దతు తెలుపుతూ, వరంగల్ ధర్నా శిబిరం వద్ద గతంలో పీసీసీ హోదాలో ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, కాంట్రాక్టు



ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్య ధోరణిని ఆపి, ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. “అందరూ సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చెయ్యాలని, ప్రత్యేకంగా బడుగు బలహీన వర్గాల కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ పాఠశాలలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, సమగ్ర శిక్ష పరిధిలోకి వచ్చే జిల్లా ఆఫీసు లో పని చేసే ఉద్యోగులు, మండల వనరుల కేంద్రంలో పని చేసే సిసిఓ, ఎం ఐ ఎస్, మెసెంజర్, పాఠశాల పరిధిలో పీటీఐ, ఐ ఈ ఆర్ పి ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ పరిధిలో సీ ఆర్ పి లు అందరి న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తున్నాం,” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు అజీజ్, ప్రధాన కార్యదర్శి సంపత్, కోశాధికారి సాయికుమార్, మహిళా నాయకురాలు శ్రీలత, పద్మ, భార్గవి, సుజాత మరియు ఇతర సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

## హోంగార్డ్ సమస్యలపై శాసనమండలిలో మాట్లాడిన ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

“అహర్నిశను పనిచేస్తున్న హోంగార్డులకు హెల్త్ కార్డులు తప్పనిసరిగా ఇవ్వాలి,” అని శాసనమండలిలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. “రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా ఇవ్వాలి,” అని ఆయన పేర్కొన్నారు. “హోంగార్డులను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చూడాలి,” అని నవీన్ కుమార్ రెడ్డి శాసనమండలిలో మాట్లాడారు.

## మర్రిజంగిరెడ్డి కి ఘన నివాళులు అర్పించిన నిరంజన్ రెడ్డి



వనపర్తి,21 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్) :
నాగర్ కర్నూలు మాజీ ఎం.ఎల్. ఎ మర్రి.జనార్ధన్ రెడ్డి తండ్రి మర్రిజంగిరెడ్డి అనారోగ్యంతో మరణించడం జరిగింది వారి అంత్యక్రియలు తిమ్మాజీపేటా మండలం జంగిరెడ్డి స్వగ్రామం నేరళ్ళ గ్రామములో మాజీమంత్రి నిరంజన్ రెడ్డి వారి పార్థివదేహాన్ని కి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించి మర్రిజమునా జనార్ధన్ రెడ్డి దంపతులను పరామర్శించారు.

## ఘనంగా ప్రపంచ ధ్యాన దినోత్సవం



ఆమనగల్లు, డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ఆమనగల్లు పట్టణంలోని ఆమనగల్ గ్రామర్ హైస్కూల్ లో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ధ్యానముద్రలో ధ్యానం చేసి ఆకట్టుకున్నారు. “ధ్యాన సాధనతో మానసిక ఉల్లాసం, మనస్సుకు ప్రశాంతత చేకూరుతుంది,” అని పాఠశాల నిర్వాహకులు ప్రదీప్ కుమార్, శివలింగం, సంజీవ్ కుమార్, కోట్ల వెంకటేష్ తెలిపారు. “చిన్నప్పటినుండే ధ్యాన సాధన అలవాటు చేసుకోవాలి,” అని వారు సూచించారు. పాఠశాలలో ప్రతిరోజు విద్యార్థులకు ధ్యానం గురించి వివరించడమే కాకుండా సాధన కూడా చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సుమతి, సమ్రిన్, ఆసియా, జయలక్ష్మి, బాలీశ్వర్, నికిత, మౌనిక, జ్యోతి, అనూష, సునీత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజు చేయూత...



సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్):
రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నిరుపేద మహిళకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా చేయూత అందించారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మ గూడెంకు చెందిన వరికుప్పల యాదగిరి భార్య సంతోష వైద్య సాయం గురించి ఎంపీ రవిచంద్ర సీఎంఆర్ఎఫ్ కు సిఫార్సు చేశారు. ఈ మేరకు మంజూరైన చెక్కును సంతోష కుమారుడు గణేష్ కు ఎంపీ వద్దిరాజు శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లచ్చమ్మ గూడెంకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు జెన్నాయికోడే జగన్మోహన్ ఉన్నారు.

## బలిజపల్లి, జంగమాయపల్లి జంట గ్రామాలను

# వేరు,వేరు గ్రామ పంచాయితీలుగా కొనసాగించాలి

**-విలీనం చేస్తే ఉద్యమానికి సిద్ధం**
**-ఇరు గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు**



వనపర్తి,21 డిసెంబర్ (నీలగిరి ఎక్స్ ప్రెస్) :
అభివృద్ధి నినాదంతో సాధించుకున్న హక్కును రాజకీయ లబ్ధికోసం,స్వార్థ రాజకీయాల కోసం కొందరి కుట్ర. ఉమ్మడి గ్రామపంచాయితిగా చేస్తే మరో లగచర్ల ఉద్యమం చేస్తాం. 30ఏండ్లుగా పోరాటం చేసి గ్రామాల అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత మా కలను నిరంజన్ రెడ్డి నెరవేర్చి బలిజేపల్లి, జంగమాయపల్లి గ్రామాలను ప్రత్యేక గ్రామపంచాయతిలుగా చేశారని,వేరు వేరుగ్రామపంచాయతీలుగా ఏర్పాటు అయిన తర్వాత గ్రామాలు శరవేగంతో అభివృద్ధి చెందాయని రెండు గ్రామాల ప్రజలం ఐకమత్యంతో మెలుగుతున్నామని ఆటువంటి మామధ్యమనస్పర్ధలు,విబేధాలు సృష్టించి మళ్ళీ రెండు గ్రామాలను కలిపి ఉమ్మడి గ్రామ పంచాయితీగా చేసి లబ్ధిపొందాలని స్థానిక ఎం.ఎల్. ఎ మేఘారెడ్డి,మాజీ Z.P.T.C రమేష్ గౌడ్ కుట్ర పన్నుతున్నారని విట్ట. నరసింహ రెడ్డి (రైతుబంధుఅధ్యక్షులు),గట్టు.నగేష్(మాజీ ఉప సర్పంచ్), విట్టా.సంజీవ్ రెడ్డి(గ్రామఅధ్యక్షులు), కుమ్మరి.బాలస్వామి ఆరోపించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా అధికారం ఉంది కదా అని తమ రాజకీయ లబ్ధికోసం గ్రామాల మధ్య చిచ్చుపెట్టడాన్ని సహించబోమని హెచ్చరించారు.ఎవరికివారు పంచాయితీ భవనాలు నిర్మించుకొని, రెవెన్యూ రికార్డు ఏర్పాటు చేసుకొని అభివృద్ధి దశలో కొనసాగుతున్న వారి పట్ల రాజకీయ కుట్రలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాభిప్రాయం తీసుకోకుండా మళ్ళీ ఉమ్మడి గ్రామ పంచాయితీ చేయడానికి నిర్ణయం తీసుకుంటే తీవ్ర స్థాయిలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. శనివారం కలెక్టర్ ని కలసి వినతిపత్రం సమర్పించడం జరిగింది మా అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశామని తెలిపారు ఈ సమావేశంలో రాములు, బోయమంగయ్య, బోయ.రాములు ,పి.కృష్ణారెడ్డి,జె.జగదీశ్వర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నరేందర్ రెడ్డి,నరేష్, హరిజన్ .వెంకటేష్, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

## అమిత్ షా ని వెంటనే అరెస్టు చేయాలి

**- విహెచ్ ఫిర్యాదు ...**





అంబర్ పేట్, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్) :
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పైన అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఖండిస్తూ వి.హనుమంతరావు అంబర్ పేట పోలీస్ స్టేషన్ లో ఇన్ స్పెక్టర్ అశోక్ కి కంప్లైంట్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వి.హనుమంతరావు మాట్లాడుతూ మన రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పైన అమిత్ షా అందరికీ అంబేద్కర్, అంబేద్కర్ అని ఫ్యాషన్ అయిపోయిందని, దేవుడిని స్మరించిన పుణ్యం వస్తుందని, చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కి ఇలాంటి అవమానం జరిగింది, వెంటనే అమిత్ షా తన పదవికి రాజీనామా చేయడానికి మరియు దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చేయాలని డిమాండ్ చేస్తూ కంప్లైంట్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిపిసి జనరల్ సెక్రెటరీ ఆర్ లక్ష్మణ్ టిపిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్, పులి జగన్, రామ్మోహన్, శ్రీధర్ గౌడ్, కోటం అనిల్, రావుల సుధాకర్, కృష్ణగౌడ్ యాదవ్, సుధాకర్, షేక్ జమీర్ లక్ష్మణ్, సోషల్ మీడియా ఫరీద్, ఫరీద్, రాజ్ కిరణ్, శ్రీనివాస్ రెడ్డి, శాంతమ్మ, రాకేష్, మణికాంత్ మారారు.

## ముద్విన్ గ్రామంలో ఘనంగా అయ్యప్ప స్వామి ఇరుముడి పూజలు



కడ్తాల్,డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)
కడ్తాల మండలం ముద్విన్, కడ్తాల గ్రామాల్లో ఆధ్యాత్మికత శోభను సంతరించుకున్నాయి. ముద్విన్ గ్రామంలో ఉన్న హనుమాన్ దేవాలయంలో డిసిసిబి డైరెక్టర్ కడ్తాల మాజీ జెడ్పీటిసి జరుపుల దశరథ్ నాయకులు కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా కడ్తాల్ గ్రామంలో జరిగిన అయ్యప్ప స్వామి ఇరుముడి మహా పూజలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రెండు గ్రామాలు అయ్యప్ప, హనుమాన్ నామస్మరణతో మార్మోగాయి.. అనంతరం గంప వెంకటేష్ గుప్తా, జరుపుల దశరథ్ నాయక్ అన్న ప్రసాదం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కడ్తాల మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు జోగు వీరయ్య, నాయకులు శివగారి నరసింహ, గురుస్వామి, గుడ్ల సురేష్, గురు స్వామి బుడ్డోని శ్రీకాంత్ స్వామి, కోటిగాని భరత్ కన్య స్వామి, కంబాలపల్లి అంజి, కోటిగాని అశోక్, బుడోని నరసింహ, రవి పెంటయ్య, సోషల్ మీడియా కన్వీనర్ అంజి, కొప్పు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన పత్రీజీ ధ్యాన మహోత్సవాలు





**-జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభం**



**కడ్తాల్, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాస్ పల్లి గ్రామ సమీపంలో ఉన్న మహేశ్వర మహా పిరమిడ్ (కైలాసపురి)లో పత్రీజీ ధ్యాన మహా యాగం వేడుకలు శనివారం అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. పిరమిడ్ స్పిర్చు వల్ సొసైటీ మూమెంట్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ అధ్వర్యంలో నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి, కర్నూల్ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ నాగరాజ్, ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయ భాస్కర్ రెడ్డి, పరిమళ పత్రీజీ, స్థానిక నాయకులతో జ్యోతి ప్రజ్వలన గావించి పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ధ్యానులను ఉద్దేశించి ఎంపీలు మల్లు రవి, నాగరాజ్ మాట్లాడుతు శ్వాసనే గమనిస్తూ ఉంటే ఎన్ని రోజులైనా ఎన్ని సంవత్సరాలైనా ఎటువంటి ఇబ్బందులు లేకుండా జీవించవచ్చని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు ధ్యానం చేయాలని సూచించారు. అదే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ధ్యానులను పులకరింపజేశారు. 11 రోజుల పాటుధ్యాన మహా వేడుకలు విజయవంతం చేసేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం ఉంటుంది అని వారు అన్నారు. జ్యోతి ప్రజల్వన కార్యక్రమం కంటే ముందు ధాన్యం దాన్ని ప్రయోజనాల గురించి అవగాహన పెంచడానికి యేటా డిసెంబర్ 21న ప్రపంచ ధ్యాన దినోత్సవం వహించాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించిన సందర్భంగా పిరమిడ్ వేదిక పైన పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు, మాస్టర్ కలిసి కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు శ్రీరామ్ గోపాల్, సాంబశివరావు, దామోదర్, హనంతరాజ్, రాంబాబు, సాంబశివరావు, లక్ష్మి, నిర్మలా దేవి, మాధవి, పిరమిడ్ మాస్టర్స్ , స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల సర్వే అధికారులకు ట్యాబులు అందించాలని డిమాండ్



**ఆమనగల్లు, డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ప్రక్రియలో భాగంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సర్వే నిర్వహించడం శుభపరిణామమేనని, కానీ సర్వే నిర్వహిస్తున్న సంబంధిత వార్డు అధికారులకు మొబైల్ ట్యాబులు అందించకపోవడం వల్ల సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సోషలిస్టు విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ జంతుక శంకర్ అభిప్రాయపడ్డారు. ఆమనగల్ మండల కేంద్రంలో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల సర్వే ను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అయితే, వ్యక్తిగత మొబైల్లలో కుటుంబ వివరాలు నమోదు చేసే ప్రక్రియలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ ఇబ్బందులు నివారించాలంటే, తక్షణమే ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేస్తున్న అధికారులకు మొబైల్ ట్యాబులు అందజేయాలి," అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మల్లెపోగు మల్లేష్, మైనార్టీ నాయకులు మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహాలు కాంగ్రెస్ ఇస్తుందా లేదా తెలంగాణ ప్రభుత్వం ఇస్తుందా?



**ఆమనగల్లు, డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్** "ఇందిరమ్మ గృహాలు కాంగ్రెస్ పార్టీ నుంచి ఇస్తున్నారా, తెలంగాణ ప్రభుత్వం నుంచి ఇస్తున్నారా?" అని ఆమనగల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పత్య నాయక్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈరోజు ఆమనగల్ పట్టణంలో స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ, "ప్రజల చేత ఎన్నుకున్న మాజీ స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు. వారిని పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి అధికారులు ఇల్లు ఇల్లు తిరిగి సర్వే చేయడం ఎంతవరకు కరెక్ట్? కాంగ్రెస్ పార్టీ నుండి నిధులు ఇస్తున్నారా, రాష్ట్ర ఖజానా నుంచి నిధులు ఇస్తున్నారా? ముందు అధికారులు తేల్చాలి," అని అన్నారు. "స్థానిక ఎన్నికలు పెట్టకుండా తాజా మాజీ స్థానిక ప్రజా ప్రతినిధులను పక్కనపెట్టి అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సర్వే చేయడం కరెక్టు కాదు. మీకు చేతనైతే ఎన్నికలు పెట్టండి, కాంగ్రెస్ పార్టీ నాయకులను స్థానిక ప్రజా ప్రతినిధులను చేయండి. లేకపోతే అధికారులు బలి అవుతారు. తస్మాత్ జాగ్రత్త," అని పత్య నాయక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, మాజీ సర్పంచ్ సోనా శీను నాయక్, బిఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ అధ్యక్షులు వద్దె వెంకటేష్, రమేష్ నాయక్, మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ కార్యదర్శి వద్దేమోని శివకుమార్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో ఉన్న నిరుపేద ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలి

**-డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా**



**హైదరాబాద్,21 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కల్వకుర్తి నియోజకవర్గంలో అధికంగా ఉన్న నిరుపేద ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా అధిక నిధులు కేటాయించి వారి అభివృద్ధికి తోడ్పాటు అందివ్వాలని కోరుతూ డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి చైర్మన్ మావిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ లతో కలిసి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత గుప్తను కోరినట్లు వెంకటేష్ గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటుచేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా నిరుపేద ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను వారికి చేరే విధంగా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని వారు కోరినట్లు తెలిపారు. నిరుపేదలైన ఆర్యవైశ్యులు గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటివరకు చిన్న చిన్న కిరాణా దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారని గుర్తు చేశారు. వారికి కార్పొరేషన్ ద్వారా ప్రోత్సహించి అత్యధికంగా రుణాలు అందించే విధంగా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఆమె సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆమెను శాలువా, పుష్పగుచ్ఛమిచ్చి ఘనంగా సత్కరించారు. చైర్ పర్సన్ ను కలిసిన వారిలో ఇటిక్యాల మండల పిఎసిఎస్ చైర్మన్ రంగారెడ్డి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ మాణిక్య రెడ్డి లు ఉన్నారు.

# గోమాత సకల దేవతలతో సమానం



**షాద్ నగర్, డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో సోలిపూర్ శ్రీ చౌడమ్మ గుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ గోశాలలో గోవులకు కోసం ఒక ట్రాక్టర్ వరిగడ్డి దానం చేయడం జరిగింది. దాత కొల్లూరు బాలరాజ్ హరిబాబు, షాద్ నగర్ కు చెందినవారు, వారి సహకారంతో ఈ దానం జరిగింది. "గోరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి. సకల దేవతలను లయమ్మైన గోమాత శాలయందు పూజించడం ఎంతో పుణ్యం," అని వారు పేర్కొన్నారు. "ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సకల దేవతలకు శుభాశీస్సులు పొందండి," అని కోరారు. శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ గోశాలలో ఆవులు కోసం ఒక ట్రాక్టర్ వరిగడ్డి దానం చేసిన వారిలో కొల్లూరు బాలరాజ్ హరిబాబు, 6వ వార్డు కౌన్సిలర్ లత శ్రీ శ్రీశైలం గౌడ్ ఉన్నారు. వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

# మేడ్చల్ మెట్రో రైలు కోసం ఎన్వీఎస్ రెడ్డి ని కలిసిన ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్





**-సీఎం రేవంత్ రెడ్డి నుండి మేడ్చల్ మెట్రో రైలును ఫేస్ -2 చేర్చడానికి సానుకూల సంకేతాలు ... ఓరుగంటి వెంకటేశ్వర్లు...**

**మేడ్చల్, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎన్నో ఏళ్లుగా మేడ్చల్ ప్రాంత ప్రజలు పోరాడుతున్నారు మరియు ప్రస్తుతం మేడ్చల్ మెట్రో రైలు ప్రాజెక్ట్ కోసం కొంపల్లి ఐటీ ఎంటర్‌ప్రీన్యూర్స్ అసోసియేషన్ (క్రైటీయా) నిర్వాహకులు, మేడ్చల్ మెట్రో రైలు సాధన సమితి కోర్ కమిటీ సభ్యులు మరియు లాస్య ఇన్ఫోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్, మేడ్చల్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పాతూరి సుధాకర్ రెడ్డి, క్రైటియాంబర్ మెంబర్ లాలం నాగరాజు, గౌళికర్ మహేష్ మరియు ఇతరులు హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్వీఎస్ రెడ్డి ని కలిసి మరోసారి వినతి పత్రాలు. ఈ సందర్భంగా, ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్ హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి చాలా స్పష్టంగా కనిపించారని మరియు త్వరలో సీఎం రేవంత్ రెడ్డి నుండి సానుకూల ప్రకటన వెలువడిందని ఆశాభావం వ్యక్తం చేశారు. మేడ్చల్ మెట్రో రైల్ కోసం ఆన్‌లైన్ పిటిషన్‌లో 25 వేల మంది ప్రజల సంతకాల జాబితాను ఎన్వీఎస్ రెడ్డి అందజేసి, మేడ్చల్ మెట్రోరైల్ కోసం లక్ష సంతకాల సేకరణ ప్రక్రియ త్వరలో పూర్తి చేస్తామన్నారు. మేడ్చల్ మెట్రో రైలు ప్రాజెక్టును ఫేస్ 2లో చేర్చాలని అన్ని రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, మంత్రులను, అధికారులను కలిసి వినతి పత్రాలు సమర్పించి విజ్ఞప్తి చేశారు. అన్ని ప్రభుత్వాలు నార్త్ హైదరాబాద్ అభివృద్ధిని విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ, 7 కొంపల్లి ఐటీ ఎంటర్‌ప్రీన్యూర్స్ అసోసియేషన్ (క్రైటీయా) కృషితో గత తెలంగాణ ప్రభుత్వం కండ్లకోయ గేట్వే ఐటీ పార్క్ ఏర్పాటుకు భూమి పూజ చేసిందని తెలిపారు. ఆతర్వాత ఐటీ ప్రాజెక్ట్ పనులు నత్తనడకగా సాగుతున్నాయని, ఎన్నో ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులు ఇప్పుడు నిరాశ చెందుతున్నారు. తెలంగాణ రాష్ట్రానికి ముఖద్వారంగా ఉన్న ఉత్తర హైదరాబాదు నగరాన్ని సమంగా అభివృద్ధి చేయడం మరియు ఇక్కడ ఇబ్బంది పడుతున్న ప్రజల ముఖ్య సమస్యలను వెంటనే దృష్టిలో పెట్టాలని తెలంగాణను మరియు కేంద్ర ప్రభుత్వాన్ని ఓరుగంటి వెంకటేశ్వర్లు యాదవ్ డిమాండ్ చేశారు.

# అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు

-వస్పుల శ్రీశైలం



ఆమనగల్లు, డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం దశలవారీగా మంజూరు చేస్తుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు నవ చైతన్య కాలనీలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారంలో ఉండి ఏ ఒక్క పేదవారికి ఒక ఇల్లు ఇచ్చిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు లబ్ధి చేకూరుతుంది,” అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ హేమలత, కాంగ్రెస్ నాయకులు మల్లె పాకుల జగదీష్, జంతుక గిరి, కర్నే రాజు, జనార్ధన్, వార్డు మహిళలు మరియు కాంగ్రెస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం, ఇబ్రహీంపట్నం డివిజన్‌కు సంబంధించిన ప్రజావాణి కార్యక్రమం M.P.D.O ఆఫీసు మీటింగ్ హాల్, ఇబ్రహీంపట్నం నందు నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు, అర్జీలు, దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించేందుకు వీలుగా ఏర్పాటు చేయబడుతుంది. ప్రజావాణి సమయం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఉంటుంది. “రెవెన్యూ విభాగానికి సంబంధించిన వినతులే కాకుండా, ఇతర శాఖలకూ చెందిన వినతులు స్వీకరించబడుతాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ విభాగానికే చెందిన అధికారులే కాకుండా, ఇతర శాఖల అధికారులు కూడా పాల్గొంటారు,” అని తెలిపారు. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో గల వివిధ మండలాల మరియు గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## శుభ్రత పాటించండి, మంచి పారితోషకం పొందండి

-జిల్లా ఎన్ ఎస్ యుఐ జనరల్ సెక్రటరీ కర్నాటి నందకుమార్ రెడ్డి



వనపర్తి,21 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మధ్యాహ్న భోజనపథకాన్ని తనికి చేసిన వనపర్తి జిల్లా ఎన్ ఎస్ యుఐ జనరల్ సెక్రటరీ కర్నాటి నందు కుమార్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో వంటకు శుభ్రమైన పాత్రలు ఉపయోగించాలని ఓపికతో విద్యార్థులకు వండి వడ్డించాలని, పనివారికి ప్రభుత్వము నుంచి మంచి పారితోషకం ఇస్తుదని ఆయన అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మిరాసిపల్లి నందు మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులను అడిగి మధ్యాహ్న భోజనం గూర్చిఅయన తెలుసుకున్నారు. వంట చేసే వర్కర్స్ ను విద్యార్థులకు నాణ్యమైన భోజనం, తో పాటు శుభ్రత ను పాటించాలనిచెప్పారు వంట వర్కర్స్ కు ప్రభుత్వం నుంచి మంచి పారితోషికం అందజేస్తుంది అని, విద్యార్థులకు గాని, వర్క్స గాని ఏవైనా సమస్యలుఉంటే ఎన్ ఎస్ యు ఐ అండగా ఉంటుందని అయన తెలియజేశారు.

## సంధ్య థియేటర్ తొక్కిసలాటలో గాయపడ్డ శ్రీతేజ్ తండ్రికి 25 లక్షల రూపాయల చెక్కు అందజేత



హైదరాబాద్, డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
సంధ్య థియేటర్ తొక్కిసలాటలో గాయపడి కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీతేజ్ తండ్రిని కోమటి రెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ తరుపున 25 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. “బాలుడి వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుంది,” అని ధైర్యం చెప్పి భవిష్యత్తులో అండగా ఉంటానని భరోసా కల్పించారు. ‘సోదరి రేవతి మరణం చాలా బాధాకరం. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను,” అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

# ఘనంగా పత్రీజీ ధ్యాన మహా యాగం-3 ప్రారంభం

-వరల్డ్ మెడిటేషన్ డే సందర్భంగా 225 గంటల అఖండ ధ్యానం
-విశేష సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్న మాస్టర్లు, ధ్యానులు
-పిరమిడ్ ప్రాంగణానికి చేరుకున్న పత్రీజీ చైతన్య జ్యోతి రథయాత్ర



కడ్తాల్(కైలాసపురి), డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
కడ్తాల్ మండలం అన్మాస్ పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్ లో ‘పత్రీజీ ధ్యాన మహా యాగం-3’ కార్యక్రమం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. డిసెంబర్ 31 వరకు ఈ కార్యక్రమం వైభవోపేతంగా కొనసాగనుంది. డిసెంబర్ 21ని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన మొదటి రోజు కార్యక్రమాల్లో 225 గంటల అఖండ ధ్యానం పరిణిత పత్రీ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో ధ్యానులు, మాస్టర్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ధ్యాన సాధన చేసారు. ‘పత్రీజీ ధ్యాన మహా యాగం-3’కు ఆహ్వానిస్తూ ‘పత్రీజీ చైతన్య జ్యోతి రథయాత్ర’ తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. బ్రహ్మర్షి పత్రీజీ జన్మదినం రోజైన నవంబర్ 11న కడ్తాల్ లోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్ లో రథయాత్ర ప్రారంభమై అనంతరం తెలుగు రాష్ట్రాల్లో పర్యటించి విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. పర్యటనను విజయవంతంగా పూర్తిచేసుకొని ‘పత్రీజీ ధ్యాన మహా యాగం-3’ శనివారం మహేశ్వర మహాపిరమిడ్ కు చేరుకోగా మాస్టర్లు, ధ్యానులు ఘనస్వాగతం పలికారు. భారీ ఊరేంగిపు నిర్వహించి నృత్యాలు చేస్తూ నినాదాలు చేస్తూ పత్రీజీ చైతన్య జ్యోతి రథయాత్రకు అపూర్వ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పరిణిత పత్రీతో పాటు మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ సభ్యులు, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

# తెలంగాణ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పై చర్యలకు ఆదేశిస్తున్నాం


-టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు
-నిన్న తిరుమల శ్రీవారిని దర్శించుకున్న శ్రీనివాస్ గౌడ్
-టీటీడీపై విమర్శలు గుప్పించిన వైనం
-తిరుమల కొండపై రాజకీయ వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించబోమన్న టీటీడీ ఛైర్మన్



తిరుపతి,21 డిసెంబర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
టీటీడీ ప్రతిష్ఠతను దెబ్బతీసేలా బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఖండించారు. శ్రీనివాస్ గౌడ్ పై చర్యలకు ఆదేశిస్తున్నామని ఆయన తెలిపారు. తిరుమల పవిత్రతను కాపాడే విషయంలో ఎంతటి వారి విషయంలోనైనా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. టీటీడీ నూతన పాలకమండలి తొలి సమావేశంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తిరుమల కొండపై రాజకీయ వ్యాఖ్యలు చేస్తే... ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని అన్నారు. నిన్న ఉదయం తిరుమల శ్రీవారిని శ్రీనివాస్ గౌడ్ దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ టీటీడీపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రజలు, ప్రజాప్రతినిధుల పట్ల టీటీడీ వివక్ష చూపుతోందని ఆయన విమర్శించారు. దేవుడు ముందు అందరూ సమానమేనని... వివక్ష చూపడం సరికాదని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత వ్యాపారాల్లో, పదవుల్లో ఎక్కువ లబ్ధి పొందుతున్నది ఆంధ్ర వాళ్లేనని శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. తెలంగాణపై వివక్ష చూపితే రాబోయే రోజుల్లో తెలంగాణలో ఆంధ్ర వాళ్లకి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే టీటీడీ ఛైర్మన్ తీవ్ర స్థాయిలో ప్రతిస్పందించారు. శ్రీనివాస్ గౌడ్ పై చర్యలకు ఆదేశిస్తున్నట్టు చెప్పారు.

## అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలి

-వగ్గు మహేష్



ఆమనగల్లు, డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
“అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలి,” అని ఆమనగల్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వగ్గు మహేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, “భారత రాజ్యాంగ నిర్మాత, హక్కుల ప్రధాత, భారతదేశానికి దిక్సూచి అయిన మహనీయుని అవహేళన చేసేలా మాట్లాడిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తీరును ఖండిస్తూ వెంటనే క్షమాపణ చెప్పాలి,” అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు జంతుక శంకర్, భీమయ్య, మైసయ్య, సాయిలు, అబ్దుల్ హాఫీజ్, రమేష్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ హై స్కూల్ అన్వల్ డే ప్రోగ్రాంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి




షాద్ నగర్, డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
షాద్ నగర్ టౌన్ గ్రీన్ పార్క్ గార్డెన్ లో కాకతీయ హై స్కూల్ అన్వల్ డే సెలబ్రేషన్ ప్రోగ్రాంలో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, “కాకతీయ హై స్కూల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు. ప్రతి విద్యార్థికి మంచి విద్య అందించి, ఉన్నత స్థాయికి తీసుకురావాలని కోరుతున్నాను. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై దృష్టి ఉంచాలి. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలంటే ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంత ముఖ్యమో, తల్లిదండ్రుల బాధ్యత కూడా అంతే ఉంది,” అని తెలిపారు. “కాకతీయ స్కూల్ విద్యార్థులు మంచి చదువు చదువుకుని స్కూల్ తో పాటు తమ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి,” అని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిని బొకేతో సన్మానించిన స్కూల్ యాజమాన్యం. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపులపై అకస్మిక తనిఖీలు, భయంతో రేషన్ బియ్యం అక్రమదారులు



హైదరాబాద్, డిసెంబరు 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపులపై అకస్మిక తనిఖీలు మొదలయ్యాయి. భయంతో రేషన్ బియ్యం అక్రమదారులు కొత్త పంథాలు అవలంబిస్తున్నారు. “రేషన్ డీలర్ అతి తెలివి,” అంటున్నారు అధికారులు. రేషన్ బియ్యం మాయం చేసి బస్తాల్లో వరి పొట్టు నింపి అక్రమ మార్గంలో తరలిస్తున్నారు. ప్రభుత్వ ఫిర్యాదుల తీరును సమీక్షించకుండా నల్ల బజార్లలో విక్రయించడం ద్వారా పేదల పొట్టలు కొడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో రేషన్ బియ్యం అక్రమాలు రోజురోజుకూ వెలుగులోకి వస్తున్నాయి. ఇక్కడి బియ్యాన్ని దేశ విదేశాలకు రేషన్ మాఫియా పక్కదారిలో, అధికారుల కళ్లు కప్పి తరలిస్తున్నారు. వందల కోట్ల విలువ చేసే బియ్యాన్ని పక్కదారి పట్టించారు. తాజాగా ఖమ్మం జిల్లాలోని తల్లాడ మండలం మిట్టపల్లిలోని రేషన్ దుకాణం-5లో బియ్యం నిల్వల్లో తేడా రావడంతో శుక్రవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తహసీల్దార్ ఎ.వనజ ఆదేశాల మేరకు ఆర్ఐ ఖాజామోహీనుద్దీన్ నిర్వహించిన తనిఖీలో, 58 క్వింటాళ్ల బియ్యం స్థానంలో కేవలం 25 క్వింటాళ్లు మాత్రమే ఉండటం, మిగిలిన 33 క్వింటాళ్ల స్థానంలో వరి పొట్టు బస్తాలు కనిపించాయి. దీంతో, రేషన్ డీలర్ వేద మహేశ్వరిపై కేసు నమోదు చేసి, దుకాణాన్ని సీజ్ చేశారు. చిత్రంలో ఒంటిచేత్తో బస్తాలను ఎత్తేస్తున్న యువకులు రేషన్ దుకాణంలో నిల్వల్లో తేడా రాకుండా వరిపొట్టు బస్తాలను బియ్యం స్థానంలో ఉంచారు. ఈ ఘటనపై రెవెన్యూ అధికారులు స్పందించి, లోగుట్టును బయటపెట్టారు.

# నేను సీఎంగా ఉన్నంతకాలం బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వను

– అల్లు అర్జున్ పై సీఎం షాకింగ్ కామెంట్స్..
– రేవతి కుటుంబాన్ని సినిమా సెలబ్రిటీలు పరామర్శించారా.. ?
–అల్లు అర్జున్ కు ఏమైందని పరామర్శిస్తున్నారు..?
–సంధ్య థియేటర్ కు బందోబస్తు నిరాకరిస్తే అల్లు అర్జున్ ఎందుకు వచ్చాడు..?



**హైదరాబాద్, డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సంధ్య థియేటర్ ఘటన విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం నాడు అసెంబ్లీలో ఈ అంశంపై ప్రత్యేకంగా మాట్లాడిన సీఎం.. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కీసలాట ఘటనను తప్పు పడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సినీ నటుడిని అరెస్ట్ చేస్తే చాలా రాద్ధాంతం చేశారని.. అంత రాద్ధాంతం చేయాల్సిన అవసరం ఏంటని సీఎం ప్రశ్నించారు. సంధ్య థియేటర్ ఘటనపై విచారణ కొనసాగుతోందన్నారు. డిసెంబర్ 2వ తేదీన పోలీసులకు సంధ్య థియేటర్ యాజమాన్యం బందోబస్తు కావాలంటూ దరఖాస్తు చేసిందని సీఎం వివరించారు. హీరో, హీరోయిన్, సినీ నిర్మాణ సిబ్బంది వస్తారని అందులో పేర్కొన్నట్లు చెప్పారు. అయితే, థియేటర్ యాజమాన్యం చేసిన అభ్యర్థనను పోలీసులు తిరస్కరించారని సీఎం గుర్తు చేశారు. సంధ్య థియేటర్ పరిసరాల పరిస్థితుల దృష్ట్యా.. సెలబ్రిటీలకు భద్రత ఇచ్చే పరిస్థితి లేదని చెప్పారన్నారు. దరఖాస్తు తిరస్కరించినా సెలబ్రిటీలు థియేటర్‌కు వచ్చారన్నారు. ఈ విషయంలో అల్లు అర్జున్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ రోడ్ షో చేస్తూ థియేటర్‌కు వచ్చారని.. అభిమానులు ఎగబడటంతో తొక్కిసలాట జరిగిందని సీఎం రేవంత్ తెలిపారు. ఈ తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోయారని సీఎం వివరించారు. ఇదే ఘటనలో తీవ్రంగా గాయపడిన రేవతి కొడుకు చావుబతుకుల్లో ఉన్నాడన్నారు. ఇద్దరు చనిపోయారని పోలీసులు చెప్పినా సినిమా చూసి.. అల్లుఅర్జున్ రూఫ్‌టాప్‌పై చేతులు ఊపుతూ వెళ్లారంటూ సీఎం నిప్పులు చెరిగారు. బాధితులను పరామర్శించేందుకు కూడా హీరో వెళ్లలేదన్నారు. అల్లు అర్జున్‌కు ఏమైందని.. సెలబ్రిటీలు పరామర్శకు వెళ్తున్నారంటూ సీఎం రేవంత్ ప్రశ్నించారు. ఆ సెలబ్రిటీలు బాధిత కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని నిలదీశారు. సినిమా వాళ్లను తాను ఒక్కటే కోరుతున్నానని.. మానవత్వం మర్చిపోవద్దన్నారు. పోలీసులు థియేటర్ యాజమాన్యంతో పాటు.. అల్లు అర్జున్‌పైనా కేసు పెట్టినట్లు సీఎం గుర్తు చేశారు.

## 40 కేజీల వెండి.. నోట్ల కట్టలు

– 'రవాణా' మాజీ కానిస్టేబుల్ ఇంటిలో సోదాలు




**భోపాల్ డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మధ్యప్రదేశ్‌లో రవాణా విభాగానికి చెందిన ఒక మాజీ కానిస్టేబుల్ ఇంటిపై లోకాయుక్త పోలీసులు దాడులు నిర్వహించారు. 40 కేజీల వెండిని, పెద్ద ఎత్తున నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్నారు. మాజీ కానిస్టేబుల్‌కు చెందిన రూ.3 కోట్లకు పైగా విలువైన ఆస్థులను(ఇందులో రూ.2.85 కోట్ల నగదు) రికవరీ చేసిన తర్వాత రోజే ఇది చోటు చేసుకోవటం గమనార్హం. నోట్ల కట్టలు, వెండితో పాటు.. రూ.50 లక్షల విలువైన బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆస్థులకు సంబంధించిన పత్రాలను కనుగొన్నామనీ, వాటిని పరిశీలిస్తున్నామని లోకాయుక్త డీఎస్పీ తెలిపారు. ఒక మాజీ కానిస్టేబుల్ ఇంటిలో పెద్ద ఎత్తున వెండి, నోట్ల కట్టలు బయటపడటంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధికారుల దర్యాప్తులో మరిన్ని విషయాలు బహిర్గతమయ్యే అవకాశాలున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

## అల్లు అర్జున్‌పై అక్బరుద్దీన్ ఒవైసీ ఫైర్..



**హైదరాబాద్:డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ అసెంబ్లీలో అల్లు అర్జున్ పై ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఫైర్ అయ్యారు. 'ఆరోజు సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగిందని పక్కనున్న వాళ్లు ఆయనకు చెప్తే "అయితే మన సినిమా హిట్ అయినట్టే" అని ఆయన వారితో అన్నారు. చనిపోయిన మహిళను కూడా చూడకుండా థియేటర్ నుంచి వెళ్తూ మరోసారి ఫ్యాన్స్

## గడచిన 24 గంటల్లో 77 మంది పాలస్తీనియన్లు మృతి



**గాజా డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గాజాపై ఇజ్రాయిల్ సైన్యం దాడుల వల్ల గడచిన 24 గంటల్లో 77 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. తాజాగా శనివారం ఇజ్రాయిల్ సైన్యం దాడుల్లో మరో 25 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని గాజాలోని వైద్యులు తెలిపారు. మరోవైపు శుక్రవారం సాయంత్రం వెస్ట్ బ్యాంక్ అంతటా ఇజ్రాయిల్ దళాలు 25 మందిని అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు చిన్నారులు, మాజీ ఖైదీ కూడా ఉన్నారని ఖైదీల గ్రూపు వెల్లడించింది.

## బడిలో బంగ్లాదేశ్ పిల్లలుంటే చెప్పండి.

–. స్కూళ్లకు సర్క్యులర్ జారీ


**హైదరాబాద్: డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**



స్కూళ్లలో బంగ్లాదేశ్ కు చెందిన పిల్లలు ఉంటే వారి వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అక్కడి స్కూళ్లకు సర్క్యులర్ జారీ చేసింది. అక్రమ వలసదారుల పిల్లలను గుర్తించాలని ఆదేశించింది. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలస వచ్చిన వారి పిల్లలను గుర్తించేందుకు డ్రైవ్ లను చేపట్టామని ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ వెల్లడించారు. ఢిల్లీలో ఉంటున్న అక్రమ వలసదారులను గుర్తించాలని లెఫ్టినెంట్ జనరల్ కార్యాలయం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ మున్సిపల్ కార్యాలయం సర్క్యులర్ జారీ చేసింది. ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు సమయం ఆసన్నమవుతోంది. అధికార ఆప్, విపక్ష బీజేపీ మధ్య వలసదారుల సమస్య కీలకం కానుంది.

## చలి చంపేస్తోంది

– శ్రీనగర్‌లో రికార్డు స్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రతలు
– గడ్డ కట్టిన దాల్ సరస్సు



**శ్రీనగర్**
జమ్మూకాశ్మీర్‌లో తీవ్రమైన శీతాకాలంగా పేర్కొనే చిలై కాలన్ శనివారం నుంచి ప్రారంభమైంది. శ్రీనగర్‌లో రికార్డు స్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 8.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయింది. గత 50 ఏండ్లలో డిసెంబరు నెలకు ఇదే కనిష్ట ఉష్ణోగ్రత అని భారత వాతావరణ శాఖ తెలిపింది. కాశ్మీర్ లోయలో ఇతర ప్రాంతాల్లోనూ ఉష్ణోగ్రతలు క్షీణించాయని వెల్లడించింది. శ్రీనగర్‌లో గురువారం రాత్రి కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 6.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయిందని, శుక్రవారానికి ఇది మైనస్ 8.5కు పడిపోయిందని వాతావరణ శాఖ తెలిపింది. శ్రీనగర్‌లో 1974 డిసెంబరులో నమోదైన 10.3 డిగ్రీల సెల్సియస్ తరువాత ఇదే కనిష్ట ఉష్ణోగ్రత అని, అలాగే 1891 నుంచి ఇది మూడో కనిష్ట ఉష్ణోగ్రత అని వాతావరణ శాఖ తెలిపింది. పహల్గాం, గుల్మార్గ్, కొనిబాల్, పాంపోర్, ఖాజిగుండ్, కుప్వారా వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు క్షీణించాయి. తక్కువ ఉష్ణోగ్రతతో దాల్ సరస్సులో చాలా భాగం గడ్డకట్టింది. అలాగే లోయలోని అనేక ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది. కాగా, చిలై కాలన్ అనేది దాదాపు 40 రోజుల పాటు ఉంటుంది. ఈ సారి ఈ కాలం 2025 జనవరి 31 వరకూ ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని తరువాత చిల్లై-ఖుర్ద్ (చిన్న చలి), చిల్లై-బచ్చా (పిల్లల జలుబు) అనే శీతాకాలాలు కూడా జమ్ముకాశ్మీర్‌లో ఉంటాయి.

## జర్మనీలో క్రిస్మస్ మార్కెట్‌పై దాడి

–ఐదుగురు మృతి, 200మందికి పైగా గాయాలు



**బెర్లిన్ డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జర్మన్ నగరమైన మగ్దెబర్గ్‌లో రద్దీగా వున్న క్రిస్మస్ మార్కెట్‌పై జరిగిన దాడిలో ఐదుగురు మరణించారు. 200మందికి పైగా గాయపడ్డారు. వీరిలో చాలామందికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ మేరకు సాక్సోనీ-అన్హల్ట్ రాష్ట్ర గవర్నర్ రెయినర్ హేజెలాఫ్ శనివారం ఒక ప్రకటన చేశారు. శుక్రవారం సాయంత్రం సౌదీ డాక్టర్ ఒకరు ఉద్దేశ్యపూర్వకంగానే నల్ల బిఎండబ్ల్యు కారును మార్కెట్‌లోకి నడుపుకుంటూ వెళ్లారని ఆ ప్రకటన తెలిపింది. రాత్రి 7గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగిన వెంటనే డ్రైవర్‌ను అరెస్టుచేశారు. ఆ సమయంలో పండుగ కోసం షాపింగ్ చేసేవారితో మార్కెట్ అంతా రద్దీగా వుంది. అనుమానితుడిని ఆ పక్కనే రోడ్డుపైనే అరెస్టు చేసినట్లు వీడియో ఫుటేజీని బట్టి తెలుస్తోంది. 50ఏళ్ళ సౌదీ డాక్టర్ 2006లో జర్మనీకి వలస వచ్చేశారు. కాగా పోలీసులు దీనిపై వ్యాఖ్యానించడానికి అందుబాటులోకి రాలేదు. తొలుత ఇద్దరే మరణించారని భావించినా, తర్వాత మృతుల సంఖ్య పెరిగింది. తీవ్రంగా గాయపడిన వారు 127మంది వున్నారని, 78మందికి స్వల్ప గాయాలయ్యాయని మీడియా వార్తలు తెలిపాయి. ఈ దాడి వార్త నగర ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. మేయర్ కళ్ళనీళ్ళ పర్యంతమయ్యారు. ఈ సంఘటనకు సంఘీభావంగా పలు ఇతర పట్టణాల్లో వారాంతపు క్రిస్మస్ మార్కెట్లను మూసివేశారు.

## కెనడా ప్రధాని ట్రూడేపై అవిశ్వాసం పెడతా

– ఎన్‌డిపి నేత జగ్‌మీత్ సింగ్ ప్రకటన



**టొరంటో డిసెంబర్ 21(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడే నాయకత్వ భవితవ్యం అనిశ్చితిలో పడినట్లు కనిపిస్తోంది. మైనారిటీ లిబరల్ ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి తీర్మానం ప్రవేశపెడతానని కీలక మిత్రపక్షమైన న్యూ డెమోక్రటిక్ పార్టీ (ఎన్‌డిపి) నేత జగ్‌మీత్ సింగ్ ప్రకటించడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైంది. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో బహిరంగ లేఖ పెట్టారు. కొత్త సంవత్సరంలో ట్రూడే నాయకత్వంలోని లిబరల్ ప్రభుత్వంపై అవిశ్వాసాన్ని ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ చర్యకు ఇతర ప్రతిపక్షాలు కూడా మద్దతిచ్చినట్లైతే సత్వరమే ఎన్నికలు వచ్చే అవకాశం వుందని భావిస్తున్నారు. ట్రంప్ టారిఫ్‌లపై ప్రధానితో విభేదాలు తలెత్తి కెనడా డిప్యూటీ ప్రధాని రాజీనామా చేశారు. అక్టోబరులోగా కెనడాలో ఎన్నికలు నిర్వహించాల్సి వుంది. లిబరల్స్‌కు మరోసారి అవకాశమిచ్చేందుకు అర్హత లేదని సింగ్ తన లేఖలో వ్యాఖ్యానించారు. అందువల్లే ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఎన్‌డిపి భావిస్తోందన్నారు. ప్రస్తుతం శీతాకాల విరామంలో వున్న పార్లమెంట్ జనవరి 27న సమావేశమవుతుంది. కాగా మరోవైపు 21మంది లిబరల్ ఎంపీలు కూడా ప్రధాని రాజీనామాను డిమాండ్ చేస్తున్నారు. ఈ వారంలో ట్రూడే ప్రభుత్వానికి తగిలిన రాజకీయ ఎదురు దెబ్బల్లో సింగ్ లేఖ తాజాది.